సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

విపత్తుల నిర్వహణపై అవగాహన ఉండాలి

● అదనపు కలెక్టర్ బీఎస్ లత

సూర్యాపేట, మార్చి 27 : ప్రకృత్తి వైపరిత్యాల వల్ల సంభవించే విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి రాష్ట్ర విపత్తు సంస్థ, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో జిల్లా అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణలో ఎదురమ్యే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విపత్తు నివారణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ అప్పారావు, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి విషయంపై సిబ్బందితో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ అప్పారావు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

● జడ్పీ సీఈఓ అప్పారావు

పెన్‌పహాడ్, మార్చి 27 : ఎండల తీవ్రత పెరుగుతున్నందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ అప్పారావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు సింగారెడ్డిపాలెంను ఆయన అకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. గ్రామంలో ఉన్న చేతి పంపులు, విద్యుత్ మోటర్లను పరిశీలించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ప్రైవేట్ బోర్ల వినియోగానికి దాతల సహకారం తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు అధికారులు గ్రామ సిబ్బంది ద్వారా పర్యవేక్షణ చేయాలన్నారు. నీటి వృథా కాకుండా సంపుల్లో మూతలు బిగించుకునే విధంగా గ్రామ సిబ్బంది పర్యవేక్షించాలని తెలిపారు. మండలంలోని పొట్లపహాడ్, అన్నారం బ్రిడ్జి గ్రామాలను మండల ప్రత్యేక అధికారి రాములు పరిశీలించి సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి తాగునీటి ఎద్దడి నివారణపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమాల్లో ఎంపీడీఓ వెంకటేశ్వర్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి వృత్తి నైపుణ్య శిక్షణలు దోహదం

● జిల్లా వ్యసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

గడ్డిపల్లి కేవీకేలో సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

గరిడేపల్లి, మార్చి 27 : వ్యవసాయ, ఇతర అనుబంధ రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణలు పొందడం ద్వారా యువత, రైతులు స్వయం ఉపాధిని పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి జి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల కేవీకేలో వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ, వ్యవసాయ శాఖ ఆర్థిక సహకారంతో యువతకు తేనెటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయంపై వారం రోజుల పాటు జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిలో యువత వ్యవసాయంతో పాటు ఉద్యాన, చేపల పెంపకం, పట్టు పురుగులు, పుట్ట గొడుగులు, కోళ్ల పెంపకం మొదలైన రంగాల్లో సాంకేతిక శిక్షణ పొందడం ద్వారా స్వయం ఉపాధితో పాటు ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. ఇన్‌చార్జి పీసీ డొంగరి నరేశ్ మాట్లాడుతూ కేవీకే చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సీహెచ్.నరేశ్, ఎ.కిరణ్, టి.మాధురి, ఎన్.సుగంధి పాల్గొన్నారు.

కోదాడ వైస్ ఎంపీపీగా గురువమ్మ

వైస్ ఎంపీపీ గురువమ్మను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

కోదాడ రూరల్, మార్చి 27 : కోదాడ మండల వైస్ ఎంపీపీగా లిక్కి గురువమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారిగా ఆర్డీఓ సూర్యనారాయణ అధ్వర్యంలో మండల ఎంపీటీసీల సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. మండల వ్యాప్తంగా 11 మంది ఎంపీటీసీలకు గాను ఇద్దరు మృతి చెందగా 9 మందికి ఆరుగురు హాజరై వైస్ ఎంపీపీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన వైస్ ఎంపీపీని ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణి, ఎంపీడీఓ రామచందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రంగారెడ్డి మృతి తీరని లోటు

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

రంగారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

గరిడేపల్లి, మార్చి 27 : మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన యర బోలు రంగారెడ్డి మృతి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మంగాపురంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి తండ్రి లచ్చిరెడ్డి ఈ ప్రాంతంలో సీపీఎం తరుపున అనేక పోరాటాలు చేశారన్నారు. ఆయన కుమారుడిగా రంగారెడ్డి ఆయన బాటలోనే నడిచి అనేక సేవా కార్యక్రమాలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్, నాయకులు రామస్వామి, భిక్షం, వెంకట్‌రెడ్డి, శేఖర్, రాంరెడ్డి పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.లక్ష పట్టివేత

పెన్‌పహాడ్, మార్చి 27 : ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష నగదును పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని మాచారం–పొట్లపహాడ్ క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాహన తనిఖీలో భాగంగా గరిడేపల్లి నుంచి మర్రిపెడబంగ్లాకు తవేరా కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి రూ.లక్ష నగదును తరలిస్తున్నాడు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి గ్రీవెన్స్ సెల్‌టీమ్‌కు అప్పజెప్పినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి అమలుకు సహకరించాలి

● ఎస్పీ రాహుల్ హెగ్డే

సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, మార్చి 27 : మే నెలలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నియమావళి అమలుకు ప్రజలు, మీడియా సహకరించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే కోరారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్–మీడియా సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి అమలులో అన్ని శాఖలను కలుపుకుని సమన్వయంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన తనిఖీల్లో రూ.2 కోట్ల నగదు, బంగారం, వెండి సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే అన్ని రకాలుగా అనుమతులు ఉన్న వాటిని వెంటనే రిలీజ్ చేస్తున్నట్లు వివరించారు. అంతరాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల జిల్లాల అధికారులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల నియామవళి అమలులో తీసుకోవాల్సిన విషయాలపై చర్చించడం జరిగిందన్నారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు, ఎఫ్ఎస్‌టీఎస్ఎస్‌టీ టీమ్‌లు నిరంతరం నిఘా పెట్టాయని వెల్లడించారు. తప్పుడు సమాచారాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ప్రచారం, ప్రసారం చేయొద్దని సూచించారు. పాత సమాచారాన్ని కొత్తదిగా చూపిస్తూ వ్యక్తులను, వ్యవస్థలను కించపరిచేలా అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నిరంతరం నిఘా ఉంటుందని గ్రూపు అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్వేశాలు రెచ్చగొట్టేలా, ఎన్నికల నియామవళికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే క్రిమినల్ చర్యలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అధ్యక్షతన మీడియా సెంటర్ కూడా నిర్వహిస్తున్నామని పెయిడ్ ఆర్టికల్స్‌పై కూడా నిఘా పెట్టినట్లు తెలిపారు. ఏదైనా సమాచారాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురణ, ప్రసారం చేయాల్సిన సందర్భం ఉంటే అందుకు కావాల్సిన విషయాలపై సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకుంటే బాగుంటుందన్నారు. అంతే గాని తప్పుడు సమాచారాన్ని తొందరపడి రిలీజ్ చేసి ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్ రావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ రవి, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

● బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట్

నేరేడుచర్ల, మార్చి 27 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిరుద్యోగులపై పెను భారం మోపుతూ పెంచిన టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొమర్రాజు వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఒక పేపర్‌కు రూ.200 , రెండో పేపర్‌కు రూ.300 ఫీజు ఉంటే నేడు ఒక పేపర్‌కు రూ.వెయ్యి, రెండో పేపర్‌కు రూ.2 వేలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చు చేసి కోచింగ్‌లు తీసుకుంటున్న నిరుద్యోగుల సమస్యను అర్థం చేసుకుని ఫీజు తగ్గించాలని కోరారు. అలాగే పరీక్షా సెంట్లర్లు కూడా అందుబాటులో ఉండేలా కేటాయించాలని పేర్కొన్నారు.

రంగస్థల కళలను ప్రభుత్వాలు కాపాడాలి

● మనమ్ వికాస్ వేదిక అధ్యక్షుడు గణేశ్



బొడ్రాయిబజార్ : పిచ్చయ్యను సన్మానిస్తున్న మనమ్ వికాస్ వేదిక అధ్యక్షుడు గణేశ్

బొడ్రాయిబజార్, మార్చి 27 : రంగస్థల కళలు నానాటికి కనుమరుగవుతున్నాయని వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని, ఇందుకు ప్రతి జిల్లా కేంద్రంలో కళాభారతి కేంద్రాన్ని నిర్మించాలని సూర్యాపేట డీఎస్పీ జి.రవి, మనమ్ వికాస్ వేదిక అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేశ్ అన్నారు. హోప్ స్వచ్ఛంద సేవా సమితి, సింధు ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షుడు దైద వెంకన్న ఆధ్వర్యంలో అంతర్జాతీయ రంగ స్థల కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రవి, సుధా బ్యాంక్‌లో ఎం.డి.పెద్దిరెడ్డి గణేశ్ చాంబర్‌లో సీనియర్ రంగస్థల కళాకారుడు డాక్టర్ గుంటి పిచ్చయ్యను శాలువా, పూలమాలతో సన్మానించి మాట్లాడారు. పిచ్చయ్య కళా రంగానికి చేస్తున్న విశిష్ట సేవలు అద్భుతమని కొనియాడారు. అంతరిస్తున్న కళలకు జీవం పోస్తున్న గుంటి పిచ్చయ్య ఆదర్శప్రాయుడన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళాకారులను ఆదుకుని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాకారులు పాముల వెంకటేశ్, కొండ శ్రీనివాస్, ఉయ్యాల నర్సయ్య, తండు వెంకన్న పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులను ఆదుకోవాలి

హుజూర్‌నగర్ : రంగస్థల కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని సీనియర్ రంగస్థల కళాకారుడు దొంతగాని సత్యనారాయణ అన్నారు. కళాకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగస్థల కళాకారుల నాటకాల ప్రదర్శనకు ప్రభుత్వ ఆర్థిక వనరులు సమకూర్చాలని కోరారు. నిజమైన కళాకారులను గుర్తించి పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు గోవింద్, రామారావు, ప్రసాద్, కిశోర్, వెంకటేశ్వర్లు, భద్రాచలం, రాజారమేశ్ పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న అధికారులు

యాతవాకిళ్ల వేములూరి ప్రాజెక్ట్ పూడికతీతకు సర్వే

మఠంపల్లి, మార్చి 27 : మండలంలోని యాతవాకిళ్ల వేములూరి ప్రాజెక్ట్ పదేండ్లుగా పూడిక తీయకపోవడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. ఈ విషయాన్ని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి సర్వే చేయిస్తున్నట్లు ఇరిగేషన్ డీఈ జి.భిక్షం బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూడికతీత పనులు పూర్తయితే వేములూరి ప్రాజెక్ట్‌లో నీటి సామర్థ్యం పెరిగి ప్రాజెక్ట్ పరిధిలోని పంట పొలాలకు నీరు అందుతుందన్నారు. సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్‌రావు, గ్రామస్తులు కుక్కల నాగరాజు, వంటిపులి శ్రీనివాస్, బుడిగ కాశయ్య, రాచమల్ల సైదులు, బండి వెంకట్‌రెడ్డి, జక్కుల గురవయ్య, బుడిగ నాగులు, ఎస్‌కే సలీం పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్ సెంటర్ కరపత్రం ఆవిష్కరణలో ఎస్ఐ మల్లేశ్

ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్

కోదాడ రూరల్, మార్చి 27 : పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం(ఆస్క్) వారు ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్, టీఎస్ఆర్‌జేసీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ వి.మల్లేశ్ అన్నారు. బుధవారం స్థానిక ఎంఎస్ కళాశాల ఆవరణలో శిక్షణా కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆస్క్ ప్రధాన కార్యదర్శి మాతంగి ప్రభాకర్, కుడుము స్వామిదాస్, వెంకటేశ్వర్లు, గంధం బుచ్చారావు, శౌరి, చెరుకుపల్లి కిరణ్, మాగి గురవయ్య, అమరబోయిన వెంకటరత్నం, సోమపంగు శ్రీనివాసులు, మీసాల వెంకటరమణమ్మ, చేకూరి రమేశ్, భానుప్రసాద్ పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా చూడాలి

● ఎంపీడీఓ సునీత

నూతనకల్, మార్చి 27 : వేసవిలో మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా రోజూ నీరు పట్టాలని ఎంపీడీఓ సునీత అన్నారు. బుధవారం మండల పరిధి బిక్కుమళ్ల, మాచనపల్లి గ్రామాల్లోని వన నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించి మాట్లాడారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కకు నీరుపెట్టి సంరంక్షించాలన్నారు. అలాగే గ్రామాల్లో పల్లె ప్రకృతి వనం, నర్సరీలో మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళలో నీరు పెట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట ఏపీఓ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

● ఎస్ఐ సైదులు

గరిడేపల్లి, మార్చి 27 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని గరిడేపల్లి ఎస్ఐ ఈట సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లవద్దన్నారు. ఆధారాలు లేక సీజ్ అయిన నగదు విషయమై అప్పీలు ఆధారాలు పొంది దరఖాస్తు చేసుకోవడానికి జిల్లా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ కమిటీ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కావున ప్రతి ఒక్కరూ ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని నడుచుకోవాలని సూచించారు.

వేపలసింగారంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

ఓటు హక్కు వినియోగించుకోవాలి

● హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్‌రూరల్, మార్చి27 : పల్లె ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. బుధవారం మండలంలోని వేపలసింగారం, బూరుగడ్డ గ్రామాల్లో పారా మిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం ఎస్ఐ ముత్తయ్య ఆధ్వర్యంలో గ్రామాల్లో ఓటరు అవగాహన చైతన్య ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● బ్యాంక్ అధికారులు

రేపూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

మేళ్లచెర్వు, మార్చి 27 : సహకార బ్యాంక్ ద్వారా అందుతున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మేళ్లచెర్వు శాఖ మేనేజర్ సంగటి సతీశ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రేపూరు, రామాపురం తదితర గ్రామాల్లో సహకార బ్యాంక్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ అనుబంధ రుణాలు, గోల్డ్ లోన్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, లాకర్ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రవి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జెర్సీ పంపిణీ

క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న అల్లీపురం మాజీ సర్పంచ్ పిచ్చిరెడ్డి, వీరారెడ్డి

మఠంపల్లి, మార్చి 27 : మండలంలోని అల్లీపురం, అంజలీపురం గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జై శ్రీరామ్ కబడ్డీ టీమ్ క్రీడాకారులకు పిల్లి వివేక్ మణికంఠ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు, విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో అల్లీపురం మాజీ సర్పంచ్ పిచ్చిరెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి : పశు వైద్యాధికారి రవికుమార్

నూతనకల్, మార్చి 27 : పాడి రైతులు తమ పశువులు సీజనల్ వ్యాధుల భారిన పడకుండా టీకా వేయించాలని మండల పశు వైద్యాధికారి రవికుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బర్రెలు, ఆవులు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రభుత్వం ఉచితంగా టీకాలను అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాలికుంటు వ్యాధి వల్ల గిట్టెలు చిట్లి పుండ్లుగా మారుతాయని నోటి ద్వారా సోల్లు కారడం వల్ల పశువులు, బర్రెలు మేత మేయక సొమ్మసిల్లి చనిపోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ భూముల కబ్జాకు యత్నం

● కొమరబండలో పల్లె ప్రకృతి వనాలు ధ్వంసం

● భూకబ్జా యత్నాలను అడ్డుకోవాలంటున్న ప్రజలు

పల్లె ప్రకృతి వనం మొక్కలను ధ్వంసం చేసిన దుండగులు

కోదాడ రూరల్, మార్చి 27 : కోదాడ పట్టణ పరిధి కొమరబండలో కోట్ల రుపాయల విలువ గల ప్రభుత్వ భూములు, పల్లె ప్రకృతి వనాలను ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామ శివారులోని వై జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ భూమితో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల ఆక్రమణకు తెగించారు. రెండు రోజుల క్రితం గ్రామ శివారులోని లేక్‌వ్యూ అతిథి గృహం సమీపంలో 1,500 గజాల స్థలంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం, తేజ విద్యాలయ సమీపంలోని వెయ్యి గజాల స్థలంలోని పల్లె ప్రకృతి వనాల ఫెన్సింగ్‌ను తొలగించారు. కోట్ల రుపాయల విలువ గల ప్రభుత్వ భూములను అధికారులు రక్షించి, ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

దీనిపై మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి స్పందిస్తూ.. పల్లె ప్రకృతి వనాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆర్డీఓ, తాసీల్దార్లు పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఎవరైనా ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడినా, పల్లె ప్రకృతి వనాలను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరిడేపల్లి, మార్చి 27 : మండలంలోని కల్మల్‌చెర్వు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల కల్మల్‌చెర్వు ఫీడర్‌లోని విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలు తొలగించేందుకు గురువారం ఉదయం 8 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రావిరాల నగేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈ ఫీడర్ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

గంజాయి విక్రేతకు రిమాండ్

మేళ్లచెర్వు, మార్చి 27 : మండల కేంద్రంలోని మైహోం ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర ఓ వ్యక్తి గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ పరమేశ్ సిబ్బందితో కలసి బుధవారం రైడ్ చేశారు. మైహోం పరిశ్రమలో రెండు నెలలుగా కూలీగా పని చేస్తున్న బీహార్‌కు చెందిన గోల్డెన్‌కుమార్ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతడిని పట్టుకుని తనిఖీ చేయగా పాలిథిన్ కవర్‌లో 200 గ్రాముల గంజాయి దొరికింది. కేసు నమోదు చేసి కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి ఆధ్వర్యంలో గోల్డెన్ కుమార్‌ను రిమాండ్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

మఠంపల్లి, మార్చి 27 : వరంగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బక్కలచ్చితండా (బిల్యానాయక్)కు చెందిన బానోతు మోహన్‌నాయక్ మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మోహన్‌నాయక్ వృత్తి రీత్యా లారీ డ్రైవర్. సాగర్ సిమెంట్స్ నుంచి లోడ్‌తో బయల్దేరగా వరంగల్ దగ్గర ఎదురుగా వస్తున్న బర్రెలను తప్పించబోయి ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కోదాడ రూరల్, మార్చి 27 : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం తెల్లవారు జామున కోదాడ పట్టణ సమీపంలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై న్యూ విజన్ స్కూల్ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతదేహంపై నుంచి వాహనాలు వెళ్లడంతో గుర్తు పట్టలేనంతగా మారిందన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడు...

పాలకవీడు, మార్చి 27 : మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో విద్యుదాఘాతంతో వృద్ధుడు సాదినేని రోశయ్య (93) మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మీనరసయ్య బుధవారం తెలిపారు. రోశయ్యకు మతిస్థిమితం లేని కారణంగా తన ఇంటికి దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు చెప్పారు. రోషయ్యకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు జగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

పాలకవీడు, మార్చి 27 : మండలంలోని రావిపహాడ్ గ్రామ అటవీ ప్రాంతంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఎస్ఐ లక్ష్మీనరసయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం, తెహర్ జిల్లా, తోట గ్రామానికి చెందిన సితాన్ భూయాన్ (32) తన సోదరుడు రాజ్‌దీప్ కుమార్, బావమరిది నమ్మి భూయాన్‌తో కలిసి స్థానిక దక్కన్ ఫ్యాక్టరీలో తాత్కాలిక కార్మికులుగా పనిచేస్తున్నాడు. ఇటీవలే సితాన్ భూయాన్‌కు పెండ్లి నిశ్చయం అయ్యింది. అయితే ఆ వివాహం తనకు ఇష్టం లేదని సోదరుడికి, బావమరిదికి తెలిపి మనస్థాపంతో మంగళవారం సాయంత్రం పనిచేసే చోటు నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. తనకోసం వెతకగా రావిపహాడ్ గ్రామంలోని అటవీ ప